## క్లుప్తంగా

### ఆలయ నిర్మాణానికి విరాళం



బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలో దూల గుట్ట వద్ద నిర్మిస్తున్న శుక్రవారం అమ్మవారి గుడి కోసం బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు ముస్కు భూమేశ్వర్ రూ. లక్ష పదహారు వేలు విరాళంగా ఇచ్చారు. ఆ మొత్తాన్ని గురువారం వీడీసీ సభ్యులకు అందజేశారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు సాయన్న, గద్దల గంగారాం పాల్గొన్నారు.

### అంగన్‌వాడి భవనం పరిశీలన

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం చేపూర్‌లో నిరుపయోగంగా ఉన్న అంగన్వాడి భవనాన్ని గ్రామ ప్రత్యేక అధికారి లక్కం ప్రభాకర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పీఆర్ ఏఈతో కలిసి భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావడానికి అయ్యే వ్యయాలను అంచనా వేశారు. అనంతరం ఆర్మూర్ జెడ్పీటీసీ సభ్యుడు మెట్టు సంతోష్‌ను భవనాన్ని వినియోగంలోకి తీసుకు రావడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

### విద్యార్థినులకు రక్త పరీక్షలు

ఎడపల్లి(బోధన్): ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిజామాబాద్ ప్రభుత్వాస్పత్రి, ఆర్బీఎస్కే వైద్య బృందం ఆధ్వర్యంలో గురువారం ఎడపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రాలు, మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సాయిలు, టీచర్లు పాల్గొన్నారు.

### గోరుముద్దకు ఆర్థికసాయం



రెంజల్(బోధన్): దూపల్లి హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు గోరుముద్ద అందించేందుకు 'మీ కోసం మేము' సంస్థ ముందుకు వచ్చింది. గురువారం సంస్థ వ్యవస్థాపకులు రఘుపతి లక్ష్మణ్, పల్లె మహేశ్‌లు పాఠశాలకు వచ్చి హెచ్‌ఎం గణేశ్‌రావ్‌తో చర్చించారు. విద్యార్థుల సంఖ్యను తెలుసుకుని పదవ తరగతి వార్షిక పరీక్షలు పూర్తయ్యే వరకు సాయంత్రం సమయంలో అల్పాహారం అందించాలని సూచించారు. అందుకు అవసరమైన ఆర్థికసాయాన్ని గణేశ్‌రావ్‌కు ఇచ్చారు.

### నేత్రదానం

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆర్టీసీ కాలనీకి చెందిన మాజీ కౌన్సిలర్ సత్యనారాయణ తల్లి కామేపల్లి లక్ష్మీ తులసమ్మ(70) గురువారం మధ్యాహ్నం మృతి చెందారని కుటుంబ సభ్యులు లయన్స్ క్లబ్‌ఆఫ్ అచన్‌పల్లికి సమాచారం అందించారని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. మృతురాలి ఇంటికి చేరుకున్న లయన్స్ ఆస్పత్రి సిబ్బంది రెండు కళ్లను తీసి లయన్స్ కంటి ఆస్పత్రికి తరలించారు.

### అల్పాహారం అందజేత



రుద్రూర్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందజేసే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. పదవ తరగతి విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నందున అచన్ పల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు స్నాక్స్, అల్పాహారం అందించడానికి ముందుకు వచ్చినట్టు పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు.

**గ్యాస్ సిలిండర్, గ్లాసులు..**

రుద్రూర్ బాలికల హైస్కూల్‌లో రాగి జావ అందిస్తున్న కార్యక్రమానికి చేయూతగా బోధన్ దీక్షిత్ గ్యాస్ ఏజెన్సీ ఆధ్వర్యంలో గురువారం పాఠశాలకు గ్యాస్ సిలెండర్‌ను, స్టీల్ గ్లాసులు అందజేశారు.

### పారిశుధ్య పనుల పరిశీలన

వేల్పూర్: లక్కోర, అంక్సాపూర్ గ్రామాలలో జరుగుతున్న పారిశుధ్య పనులను ప్రత్యేక అధికారి, తహసీల్దార్ నాగార్జున గురువారం పరిశీలించారు. వేసవిలో తాగునీటి ఇబ్బంది రాకుండా చూడాలని కార్యదర్శులను ఆదేశించారు.

**పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి**

బాల్కొండ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ సామ పద్మ అన్నారు. గురువారం బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల్లో అధికారులు, ప్రతినిధులు శ్రమదానం నిర్వహించారు. ప్రధాన రోడ్లు, కార్యాలయాలను శుభ్రం చేశారు.

### కబ్జా తొలగింపు

బోధన్ టౌన్ (బోధన్): పట్టణంలోని రెంజల్ బేస్ గాలిబ్ నగర్‌కాలనీలో రోడ్డుని అనుకొని ఉన్న స్థలాన్ని దత్తు అనే వ్యక్తి కబ్జా చేసి పశువుల కొట్టం వేశాడు. రాకపోకలకు ఇబ్బంది కలగడంతో కబ్జాను తొలగించాలని స్థానికులు గతంలో ఫిర్యాదు చేశారు. అధికారులు నోటీసులు ఇచ్చినా తొలగించకపోవడంతో గురువారం జేసీబీతో కూల్చివేశారు. కమిషనర్ ఖమర్ అహ్మద్, అధికారులు రాజేశ్వర్, ఆంజనేయులు, ట్రైనీ ఐపీఎస్ అధికారి చైతన్య, ఎస్సై పీటర్, కౌన్సిలర్ ఇంతియాజ్ పాల్గొన్నారు.

# వంద శాతం వసూలయ్యేనా?

- యాభై రోజుల్లో 55.6 శాతం పన్నులు రాబట్టడమే లక్ష్యం
- వసూళ్లకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు




ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నులు వసూలు చేయటానికి మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ చౌహాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. గత సంవత్సరం లాగానే ఆస్తి పన్నులు వంద శాతం పూర్తయిన విధంగా ఈ ఏడాది కూడా అధికారులు కృషిచేస్తున్నారు. ఇందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేసుకొని ముందుకు సాగుతున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో మొత్తం ఇళ్లు, దుకాణాలు కలిపి సుమారు 19,452 (అసెస్‌మెంట్‌లు) వరకు ఉంటాయి. మున్సిపల్‌కు ఆస్తి పన్నులు ఇప్పటి వరకు రూ.3 కోట్ల 20 లక్షల 24వేలు వసూలు చేశారు. ఇంకా 50 రోజుల్లో 55.6 శాతం పన్నులు వసూలు చేయాల్సి ఉంది. మార్చి 31లోగా వందశాతం పన్నులు వసూలు కోసం బిల్ కలెక్టర్‌లను వివిధ వార్డులకు కేటాయించారు. మొత్తం ఐదు బృందాలు ప్రతి రోజూ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు తిరిగి ఆస్తి పన్ను లు వసూలు చేస్తున్నారు.

**ప్రజలు సహకరించాలి**



ప్రజలు ప్రతి ఏటా సకాలంలో ఆస్తి పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి. పన్నులు చెల్లించకపోతే అభివృద్ధి కుంటుపడుతుంది. ఇంటి వద్దకు వస్తున్న మున్సిపల్ అధికారులకు ఆస్తి పన్నులు చెల్లించి తోడ్పాటు అందించాలి.

– ప్రసాద్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

# బీజేపీ, కాంగ్రెస్‌లపై ఇక యుద్ధమే

- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న
- ఆర్మూర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో వ్యాఖ్యలు

ఆర్మూర్: ప్రజల సమస్యలు పరిష్కరించడంలో భాగంగా ఇక బీజేపీ, కాంగ్రెస్ పార్టీలపై యుద్ధమే చేస్తామని మాజీ మంత్రి జోగు రామన్న, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి హెచ్చరించారు. ఆర్మూరు పట్టణంలోని ఎమ్మార్ గార్డెన్‌లో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు. అసత్యపు హామీలతో ప్రజలను మభ్యపెడుతున్న బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు. ఓటుకు నోటు కేసులో దొరికిన రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం దౌర్భాగ్యమన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల్లో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలుబొమ్మగా మారారని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ రాజకీయం చేస్తున్నారని విమర్శించారు. సోనియా గాంధీ జన్మదినం రోజు రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేస్తామని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి రైతులను మోసం చేశారన్నారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### మాజీ సర్పంచ్‌లకు సన్మానం

ఇటీవల తమ పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న తాజా మాజీ సర్పంచ్‌లను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్ను, కౌన్సిలర్ గంగ మోహన్ చక్రు, బీఆర్ఎస్ పార్టీ ఆర్మూర్ పట్టణ అధ్యక్షుడు పూజ నరేందర్, మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, వేదికపై మాజీ మంత్రి జోగు రామన్న

# ఎంపీ స్థానాన్ని గెలిపించుకుంటాం



మాక్లూర్: మాట్లాడుతున్న గంగోనే సంతోష్



పోతంగల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు

మాక్లూర్: త్వరలో జరుగబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీ స్థానాన్ని గెలిపించుకుని తీరుతామని బీజేపీ జిల్లా కార్యదర్శి గంగోనే సంతోష్ ధీమా వ్యక్తం చేశారు. పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా గురువారం మాదాపూర్, అడవి మామిడిపల్లి గ్రామాలలో జరిగిన కార్యక్రమాలకు సంతోష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. గ్రామాల్లో కొందరికి కేంద్ర ప్రభుత్వ పథకాలు తెలియక ఇంత కాలం నష్టపోయారన్నారు. అలాంటి వారందరికి పల్లెకు పోదాం కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నామన్నారు. బీజేపీ మండల నాయకులు రాథోడ్ రాజశేఖర్, రాజేశ్వర్, చింత ప్రవీణ్ రెడ్డి, హరీష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

### బీజేపీని గెలిపించండి

నవీపేట: దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న బీజేపీని గెలిపించాలని బీజేపీ నాయకులు ఓటర్లను కోరారు. కోస్లీ, పోతంగల్ గ్రామాలలో గురువారం నిర్వహించిన పల్లెకు పోదాం కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. పీఎం నరేంద్ర మోదీని మరోమారు గెలిపించాలని కోరారు. బీజేపీ నాయకులు బండారి రాజశేఖర్, పిల్లి శ్రీకాంత్, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

### బెల్టు దుకాణాలను రద్దు చేయాలి



బోధన్‌టౌన్(బోధన్): బెల్టు దుకాణాలను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ప్రజా పంథా పార్టీ డివిజన్ కార్యదర్శి బి. మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం మద్యం, బెల్టు దుకాణాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్డీవో కార్యాలయం ఎదుట ప్రజా పంథా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, కార్యాలయ అధికారి విఠల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ డివిజన్ కార్యదర్శి మాట్లాడారు. గ్రామాలతో పాటు పట్టణంలో అనేక బెల్టు దుకాణాలు అనుమతులు లేకుండా నడుస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని కోరారు. మండల ప్రధాన కార్యదర్శి పడాల శంకర్, నాయకులు సీతారాం, పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షులు బి.నాగమణి, తదితరులున్నారు.

### పంటల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



బాల్కొండ: పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి వాజిద్ హుస్సేన్ అన్నారు. బుధవారం మెండోరా మండలం వెల్కటూర్‌లో పంటల నమోదు ప్రక్రియను పరిశీలించారు. సర్వే నంబరు వారీగా పంటల వివరాలను నమోదు చేయాలని ఏఈవోలకు సూచించారు. వ్యవసాయ అధికారి రాజు కుమార్, ఏఈవోలు రాజేశ్వర్, సాయికృష్ణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

### సమ్మెనోటీసు అందజేత

ఎడపల్లి(బోధన్): గ్రామ పంచాయతీ కార్మికులు 16న సమ్మె చేయనున్నట్టు మండల పంచాయతీ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయ్ సైడ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు పద్మలు గురువారం ఎడపల్లి ఎంపీవో సుభాష్ చంద్ర బోసుకు పంచాయతీ కార్మికులు సమ్మెనోటీసు అందజేశారు. వారు మాట్లాడుతూ.. గత కొన్ని ఏళ్లుగా పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. నాయకులు జి శ్రీనివాస్, రైమత్, రాజు, సంతు ఉన్నారు.

# పరుష పదజాలం ఉపయోగిస్తే సహించం



మాట్లాడుతున్న డీసీసీ కార్యదర్శి మనోహర్

కోటగిరి(రుద్రూర్): పరుష పదజాలంతో మాట్లాడితే సహించేది లేదని కోటగిరి ఎంపీటీసీ, డీసీసీ కార్యదర్శి కొట్టం మనోహర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కోటగిరి మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన మాట్లాడారు. బాన్సువాడ సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డిపై బుధవారం బీఆర్ఎస్ సమావేశంలో డీసీసీబీ చైర్మెన్ పోచారం భాస్కర్ రెడ్డి ఉపయోగించిన పదజాలాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. హోదాను మరిచి మాట్లాడం సిగ్గుచేటని అన్నారు. దూషణలే ఆభరణాలనుకుంటే ప్రతి దూషణలకు తాము సిద్ధమేనని సవాల్ విసిరారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చూసుకోవాలని హితవు పలికారు. మాజీ ఎంపీపీ గంగాధర్ దేశాయ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు షాహీద్, కిసాన్ ఖేత్ మండల అధ్యక్షుడు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## సమాచారం..


### నేడు బియ్యం వేలం పాట

రెంజల్(బోధన్): అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యానికి శుక్రవారం బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాంచందర్ తెలిపారు. మహారాష్ట్రకు బియ్యం తరలిస్తుండగా పలు శాఖల అధికారులు పట్టుకున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వేలం వేస్తున్నట్లు తెలిపారు. రెంజల్‌లోని వాసవీ రైస్ మిల్‌లో 324 క్వింటాళ్ల 70 కిలోలు, సాటాపూర్‌లోని డీలర్ వద్ద 7 క్వింటాళ్ల 60 కిలోల బియ్యం ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి కల్గిన వారు ముందుగా రూ.25 వేల ధరావతు చెల్లించాలని చెప్పారు.

### విధుల్లో చేరిన వైద్యారోగ్య సిబ్బంది

కమ్మర్‌పల్లి: వైద్య ఆరోగ్య శాఖలో డిప్యుటేషన్లను రద్దు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో డిప్యుటేషన్‌లో ఉన్న ఉద్యోగులు తమ యథాస్థానాలకు వచ్చారు. కమ్మర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సహీబుద్దీన్ భీమ్‌గల్ మండలం ముచ్కూర్ పీహెచ్‌సీకి, పీహెచ్ఎన్ జి. ప్రేమలత ఆర్మూర్ సీహెచ్‌సీకి, సీహెచ్‌వో జేమ్స్ న్యూటన్ జక్రాన్‌పల్లి పీహెచ్‌సీకి, ఫార్మసిస్ట్ శరత్ మాలపల్లి యూపీహెచ్‌సీకి, ఎంపీహెచ్ఎస్(ఎఫ్) యాదమ్మ బోధన్ డీహెచ్‌కు, ఎంపీహెచ్ఎస్(ఎం) రవీందర్ గోవిందపేట్ పీహెచ్‌సీకి, ఎంపీహెచ్ఏ(ఎం) పవన్ కుమార్ చౌట్‌పల్లి పీహెచ్‌సీకి, కాంపౌండర్ ఆనంద్ ఇందల్వాయి పీహెచ్‌సీకి డిప్యుటేషన్‌పై వెళ్లారు. వీరంతా గురువారం కమ్మర్‌పల్లి పీహెచ్‌సీలో విధుల్లో చేరారు. చౌట్‌పల్లి పీహెచ్‌సీలో ఇదివరకు డిప్యుటేషన్‌పై హెచ్‌ఈవోగా విధులు నిర్వహించిన సత్యనారాయణ భీమ్‌గల్ పీహెచ్‌సీకి వెళ్లి విధుల్లో చేరారు.

### సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్




పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

| | |
|---|---|
| స్క్రీన్-1 – | కెమెరామెన్ (తెలుగు) - 2.45<br>హనుమాన్(తెలుగు) - 6.00<br>తేరి బాతోమే (హిందీ) - 9.20 |
| స్క్రీన్-2 – | ఈగల్ (తెలుగు) - 11.20, 02.40, 6.00, 9.20 |
| స్క్రీన్-3 – | ఈగల్ (తెలుగు) - 10.10 యాత్ర-2 1.30, 4.25, 7.20, 10.15 |
| స్క్రీన్-4 – | యాత్ర-2 (తెలుగు) - 10.05<br>తేరి బాతోమే (హిందీ) - 4.15 |

# పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం



చెత్త ఎత్తుతున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

మాక్లూర్: పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటేనే వ్యాధులు రాకుండా ఉంటాయని జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ఎంపీడీవో క్రాంతి, పంచాయతీ సెక్రెటరీ మోహన్ ఇతర సిబ్బందితో కలిసి చెత్త సేకరించారు. వీధులను శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు మాట్లాడుతూ.. విష జ్వరాలు సోకి ప్రజలు ఆస్పత్రుల పాలవుతున్నారన్న ఉద్దేశంతో ముందస్తుగా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారన్నారు. అనంతరం తాగునీరు, ఇతర అంశాలపై తగు సూచనలు చేశారు. మాజీ సర్పంచ్ దారం ప్రవీణ్ పాల్గొన్నారు.

### పసుపు దిగుబడి వివరాల సేకరణ



పసుపు తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

నందిపేట్(ఆర్మూర్): జోర్‌పూర్ గ్రామంలో రాష్ట్ర ఆర్థిక గణాంక శాఖ ఆధ్వర్యంలో గురువారం పసుపు పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు పంట దిగుబడిని పరిశీలించారు. పంటలో కేంద్ర భాగాన్ని తవ్వి పసుపు కొమ్ములను సేకరించారు. సేకరించిన పసుపు పంటను తూకం వేసి, ఆశించిన స్థాయిలో దిగుబడి వస్తుందా లేదా అని పరిశీలించిన అనంతరం వ్యవసాయ శాఖకు నివేదిస్తామని ప్రణాళిక శాఖ అధికారి రవీందర్ తెలిపారు. దీనికి అనుగుణంగా రైతులకు పంట దిగుబడులపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈ ప్రయోగాలను జీఎస్‌డీపీ, పంట దిగుబడి అంచనాల కోసం నిర్వహిస్తున్నామన్నారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, గణాంక శాఖ అధికారులు సరోజ, సాయికిరణ్, స్పందన, రిషిత తదితరులున్నారు.

# బిల్లులు ఇవ్వపోతే కేసులు నమోదు చేస్తాం



ఫర్టిలైజర్ దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

నందిపేట్(ఆర్మూర్): రైతులు తీసుకున్న ఎరువులు, ఫర్టిలైజర్ మందులకు బిల్లులు ఇవ్వకుంటే కేసులు నమోదు చేస్తామని డీలర్లను జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ హెచ్చరించారు. నందిపేట మండల కేంద్రంలో గురువారం ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా ఈపీవోఎస్‌లోని ఎరువుల నిల్వలు, భౌతిక నిల్వలు, ఫర్టిలైజర్ వివరాలను ఇన్వెంటరీ వెరిఫికేషన్ యాప్‌లో లోడ్ చేసే విధానాన్ని వివరించారు. ఎరువుల ధరలు, నిల్వల పట్టికను రైతులకు కనపడేలా బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. డీలర్లకు సూచనలు అందించారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవాని, విస్తరణ అధికారులు విజయ్, గంగాధర్ ఉన్నారు.

### దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోవాలి



రుద్రూర్: సులేమాన్‌నగర్‌లో ఇటీవల యువకులపై దాడి చేసిన వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని వీహెచ్‌పీ జిల్లా సభ్యులు కృష్ణ, దినేష్ ఠాకూర్ డిమాండ్ చేశారు. ఈమేరకు రుద్రూర్ మండల కేంద్రంలో గురువారం సీఐని కలిసి విన్నవించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గత నెల 22న జరిగిన ఘటనకు సంబంధించి ఇప్పటి వరకు నిందితులను అరెస్ట్ చేయకపోవడమేమిటని ప్రశ్నించారు. జాప్యం చేస్తే వీహెచ్‌పీ, బజరంగ దళ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి దయానంద్, సహ కార్యదర్శి దాత్రిక రమేష్, నగర అధ్యక్షుడు రమేష్ పాల్గొన్నారు.




# నేడు రామన్నపేట్ అయ్యలగుట్ట జాతర



ముస్తాబైన విగ్రహమూర్తుల గద్దె



శ్రీరాంపూర్‌లో ముస్తాబైన ఆలయం

వేల్పూర్: రామన్నపేట్‌లో అయ్యలగుట్ట రాజరాజేశ్వరస్వామి జాతర శుక్రవారం జరుగనుంది. జాతర కోసం స్థానిక వీడీసీ ఆధ్వర్యంలో ఘనంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.ప్రతి ఏటా మాఘ అమావాస్య రోజున ఈ జాతరను నిర్వహిస్తారు. భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన అయ్యలగుట్ట రాజరాజేశ్వస్వామిని గ్రామస్తులే కాకుండా చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, దూర ప్రాంతాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజిస్తారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. జాతరకు వచ్చే భక్తులకు అన్నదానం చేస్తారు. జాతరకు ఆలయాన్నిసుందరంగా తీర్చిదిద్దారు.

**ఉత్సవాలకు 'చిలుకల చిన్నమ్మ' ముస్తాబు**

బాల్కొండ: శ్రీరాంపూర్‌లో చిలుకల చిన్నమ్మ ఆలయం శుక్రవారం నిర్వహించే ఉత్సవాలకు ముస్తాబైంది. చిలుకల చిన్నమ్మ ఆలయంలో ప్రతి సంవత్సరం మాఘ అమావాస్య రోజున ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు. వీడీసీ ఆధ్వర్యంలో జాతరకు ఏర్పాట్లు చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లో ముంపునకు గురైన గ్రామాల ఇలవేల్పుగా చిలుకల చిన్నమ్మ ఆలయం ప్రసిద్ధి. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

### పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన




ఎడపల్లి(బోధన్): పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు నేచర్ క్యాంపు నిర్వహించారు. ఆలీసాగర్‌లో మూడు రోజుల పాటు కార్యక్రమాలు నిర్వహించారు. నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన జుమ్మారాజీపేట్, సోమవార్‌పేట్, ఈద్గామ్ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. నేషనల్ గ్రీన్ కార్ప్స్(జాతీయ హరిత దళం) కార్యక్రమంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఆలీసాగర్ నీటి అవరణ వ్యవస్థ, అటవీ ఆవరణ వ్యవస్థ, పక్షులు వాటి ధ్వనులు, వృక్షాలపై నివసించే వివిధ రకాల క్రిమి కీటకాలు, జంతువుల జీవన విధానం, వివిధ రకాల మొక్కలు వాటి ఉపయోగాలు ప్రత్యక్షంగా విద్యార్థులకు వివరించారు. రాష్ట్ర ఎన్‌జీసీ ప్రాజెక్ట్ అధికారి విద్యాసాగర్, నిర్మల్ జిల్లా కో-ఆర్డినేటర్ మోహన్‌రావు, టీచర్లు పాల్గొన్నారు.